

# ఉపాధికి మూలస్తంభంగా చేనేత పరిశ్రమ

**- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ రాహుల్ శర్మ**



చేనేత కార్మికులతో కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికి చేనేత పరిశ్రమ మూలస్తంభంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేనేత కార్మికులకు రుణమాఫీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమూపార్జనలో చేనేత రంగం ఒక సాధనంగా నిలిచిందన్నారు. జిల్లాలో మగ్గాలపై బట్టలు నేసే కార్మికులు చాలా మంది ఉన్నారన్నారు. మహదేవపూర్ మండలంలో దసలి పట్టుతో నేసే బట్టలు విదేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పద్మశాలి సంఘం నాయకులు, చేనేత సహకార సంఘం సొసైటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరిస్తా..

- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**
- **కేజీబీవీ, వసతి గృహాలు, హాస్టళ్ల నిర్వహణపై సమీక్ష**



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, హాస్టళ్లు, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హాస్టళ్లు, కేజీబీవీ, వసతి గృహాల అధికారులు, సిబ్బందితో సహ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన భోజన మెనూ పాటించాలని సూచించారు. నీటి సదుపాయం, భద్రతా ఏర్పాట్లు, వైద్య ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, నర్సులు అందుబాటులో ఉండడం విధిగా భావించి పనిచేయాలని అన్నారు. ఇటీవల హాస్టళ్ల సందర్శనలో పలు రకాల లోపాలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. అవి మరలా పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలన్నారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదని తేల్చిచెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఎంఈవోలు పాల్గొన్నారు.



ములుగు వ్యవసాయ మార్కెట్ ప్రధాన ముఖ ద్వారం

# పరికరాల కొనుగోళ్లలో గోల్‌మాల్..?




ములుగు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు కావాల్సిన పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, మ్యాశ్చర్ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు తదితర పరికరాల కొనుగోలు, నిర్వహణలో గోల్‌మాల్ జరిగాయనే విమర్శలొస్తున్నాయి. సంబంధిత అధికారులు పరికరాలను కొనుగోలు చేయకుండానే లెక్కల్లో చూపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోలు చేసిన పరికరాలను చూపాలని ఉన్నతాధికారులు కోరగా పక్క జిల్లాకు పంపామని వ్యవసాయ మార్కెట్ అధికారులు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో వ్యవసాయ మార్కెట్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర సీరియస్ అయినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా ఇద్దరు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ కమిటీలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మార్కెట్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి ములుగు మార్కెట్‌లో జరిగిన అవకతవకలపై ఇటీవల విచారణ జరినట్లు తెలిసింది.

- చేతివాటం ప్రదర్శించిన అధికారులు
- కొనుగోలు చేయకుండానే చేసినట్లు లెక్కలు
- ములుగు మార్కెట్ అధికారుల తీరుపై కలెక్టర్ కన్నెర్ర
- ప్రత్యేక కమిటీని నియమించి విచారణకు ఆదేశాలు

### కొనుగోలు చేయకుండానే లెక్కలు..

ములుగు వ్యవసాయ మార్కెట్‌లో పరికరాలు కొనుగోలు చేయకుండానే చేసినట్లు లెక్కలు చూపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొనుగోలు చేసిన పరికరాలను చూపాలని ఉన్నతాధికారులు అడగడంతో భూపాలపల్లి జిల్లాకు పంపామని మార్కెట్ కమిటీ అధికారులు తెలిపినట్లు సమాచారం. కాగా, ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ నుంచి భూపాలపల్లి జిల్లాకు ఎలక్ట్రానిక్ కాంటాలు 10, మ్యాశ్చర్ మీటర్లు 30, గ్రేన్ క్యాలీపర్స్ 65, హస్క్ రిమూవర్స్ 60, ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు 4 పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

అయితే భూపాలపల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్‌కు పరికరాలు కావాల్సి ఉంటే ఆ జిల్లా అదనపు కలెక్టర్ ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌కు రిక్వెస్ట్ లెటర్ పంపాల్సి ఉంటుంది. అయితే అలాంటి లెటర్ ఏది పంపినట్లు లేదని సమాచారం. అయితే ఇటీవల నియమించబడిన మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి చైర్‌పర్సన్ కళ్యాణి మార్కెట్‌లో ఉన్న పరికరాల లెక్కలు చూపాలని అధికారులను అడుగగా పాత మిషన్లు, పక్క జిల్లా నుంచి తీసుకువచ్చిన పరికరాలను చూపుతున్నట్లు సమాచారం.

అయితే గత 7 సంవత్సరాలుగా ములుగు మార్కెట్ కమిటీకి పాలక మండలి లేకపోవడంతో భారీ మొత్తంలో అవకతవకలు జరిగి ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత సంవత్సరం పత్తి కొనుగోళ్లలో పలువురు అధికారులు కోట్లలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి. మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ మార్కెట్ అధికారులపై జరుగుతున్న విచారణపై జిల్లా అధికారులను వివరణ కోరగా వాస్తవమేనన్నారు.

### కొనుగోలు చేసినట్లు చెబుతున్న పరికరాలివే..

గత సంవత్సరం వానా కాలంలో పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు డిజిటల్ మ్యాశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్, ప్యాడీ క్లీనర్లు, గ్రేన్ క్యాలీపర్స్, హస్క్ రిమూవర్స్, టార్పాలిన్లు, తదితర పరికరాలను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో రూ.1,14,38,960 వెచ్చించి 50 డిజిటల్ మ్యాశ్చర్ మీటర్లు, 156 ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్, 40 ప్యాడీ లిఫ్టర్ కం క్లీనర్లను కొనుగోలు చేశామని జిల్లా మార్కెటింగ్ అధికారి కనకశేఖర్ తెలిపారు. అయితే ఇవే గాకుండా 4వేల టార్పాలిన్లు, 180 గ్రేన్ క్యాలీపర్స్, 180 హస్క్ రిమూవర్స్ అదనంగా కొనుగోలు చేశామని చెబుతున్నారు. అయితే వీటికి సంబంధించిన బిల్లులు హెడ్ ఆఫీస్ నుంచి రావాల్సి ఉందని అధికారులు అంటున్నారు.

# తాగునీటి సరఫరా సక్రమంగా జరగాలి

**సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**

**రేగులగూడెం జీపీలో స్కీం పాయింట్ బోర్ పరిశీలన**



నల్లా నీటిని పరిశీలిస్తున్న అధికారులు

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీలో వారు పర్యటించారు. పలువురు మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడంతో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి సబ్ కలెక్టర్, అదనపు కలెక్టర్ గ్రామంలోని స్కీం పాయింట్ బోర్‌ను పరిశీలించారు. మోటార్ ద్వారా నల్లాలకు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. పలువురు ప్రజలు మిషన్ భగీరథ, బోర్ ద్వారా నీళ్లు కొంచెమే రావడంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో వారు 20వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్‌ను మూడుసార్లు మిషన్ భగీరథ నీటితో నింపి సరఫరా చేయాలని, స్కీం పాయింట్ బోర్‌ను ఫ్లషింగ్ చేయించి మురికినీరు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, గ్రిడ్ డీఈఈ కిరణ్, ఏఈలు రాజశేఖర్, జీపీ కార్యదర్శి కృష్ణవేణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై కుంగిన బ్రిడ్జి

- మల్లంపల్లి శివారులో రాత్రి చోటుచేసుకున్న ఘటన
- వాహనాల రాకపోకలకు పోలీసుల బ్రేక్
- గూడెప్పాడ్ క్రాస్ నుంచి వాహనాల దారి మళ్లింపు
- ప్రత్యామ్నాయంగా పరకాల, రేగొండ మీదుగా రాకపోకలు
- బ్రిడ్జి శిథిలదశకు చేరే వరకు పట్టించుకోని అధికారులు

ములుగు రూరల్/ఆత్మకూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి శివారులోని జాతీయ రహదారిలో వున్న పురాతన ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి గురువారం రాత్రి కుంగుబాటుకు గురైంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కొంత కాలంగా ఇక్కడ నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బ్రిడ్జి కుంగుబాటుకు గురికావడంతో కలకలం రేపింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. ములుగు నుంచి హనుమకొండ వైపుకు వెళ్లే వాహనాలను అబ్బాపూర్, రేగొండ, పరకాల, గూడెప్పాడ్ మీదుగా, హనుమకొండ నుంచి ములుగు వచ్చే వాహనాలను గూడెప్పాడు, పరకాల, రేగొండ, అబ్బాపూర్ మీదుగా పంపిస్తున్నారు. బ్రిడ్జి మరమ్మతులు చేపట్టేంత వరకు వాహనదారులు గూడెప్పాడ్, పరకాల, రేగొండ మీదుగా రావాలని పోలీసులు సూచిస్తున్నారు.

మల్లంపల్లి శివారులో దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి కొంతకాలంగా శిథిలావస్థకు చేరుతూ వచ్చింది. ముందుగానే గమనించి ప్రత్యామ్నాయ బ్రిడ్జి ఏర్పాటుచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో శిథిల బ్రిడ్జిపైనే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే బ్రిడ్జి కుంగుబాటుకు గురైంది. గురువారం రాత్రి బ్రిడ్జి గనుక ఒక్కసారిగా కూలిపోతే పరిస్థితి ఏమిటని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ నుంచి భూపాలపట్నంకు వెళ్లే జాతీయ రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం బ్రిడ్జి కుంగిన నేపథ్యంలో ట్రాఫిక్ దారి మళ్లించడంతో చుట్టూ తిరిగి వెళ్లక తప్పదు. ఇలా ఎన్ని రోజులు అనేది అధికారులు చెపాల్సి ఉంది.



గూడెప్పాడ్ క్రాస్ రోడ్డు నుంచి వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు



జేడీ మల్లంపల్లి శివారులో కుంగిన ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి

### గూడెప్పాడ్ క్రాస్ రోడ్డు నుంచి మళ్లింపు

వరంగల్ నుంచి భూపాలపట్నంకు వెళ్లే జాతీయ రహదారిలో మల్లంపల్లి వద్ద బ్రిడ్జి కుంగిపోవడంతో అధికారులు దారిమళ్లింపు చర్యలు చేపట్టారు. మల్లంపల్లి వైపు వెళ్లకుండా రోడ్డును బ్లాక్ చేశారు. బారికేడ్‌లను పెట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సీఐ. సంతోష్ స్వయంగా పర్యవేక్షించారు. గూడెప్పాడ్ క్రాస్ రోడ్డు నుంచి వాహనాలను పరకాల వైపు మళ్లించారు. గూడెప్పాడ్ క్రాస్ రోడ్డు నుంచి పరకాల, రేగొండ మీదుగా వాహనాలను దారి మళ్లించిన్నట్లు తెలిపారు. దీంతో వాహనదారులు పరకాల, రేగొండ మీదుగా ములుగు చేరుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యామ్నాయ మార్గం ఇరుకుగా ఉండడంతో రద్దీ పెరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నట్టు తెలిసింది. లారీలు, బస్సులు, భారీ వాహనాలు ఒకే మార్గంలో ఎదురెదురుగా వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్

- కేసీఆర్‌పై కక్షతో ప్రాజెక్టులు నిర్వీర్యం
- తెలంగాణను కరువు రాష్ట్రంగా మార్చారు..
- మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, గండ్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అని, కేసీఆర్‌పై కక్షతో సాగు నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. జనగామ జిల్లా పూర్తిగా దేవాదుల నీళ్లపై ఆధారపడి ఆయకట్టు రైతులు వ్యవసాయం (మిగతా 8వ పేజీలో)

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**ప్రతి రోగికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేయాలి**

**రాష్ట్ర కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అమర్‌సింగ్**



ములుగులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న డాక్టర్ అమర్‌సింగ్

ములుగు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అమర్‌సింగ్ అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. పలు వార్డుల్లో తిరిగి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంకులో అన్ని గ్రూపుల రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు. డ్రగ్స్ స్టోర్‌లో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులకు ఇచ్చే మందులను సమకూర్చుకోవాలని ఆదేశించారు. జ్వరం ఉన్న (మిగతా 8వ పేజీలో)

# భూ భారతికి సమస్యల హారతి

- భూపాలపల్లి జిల్లాలో 50వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్
- ఎక్కువ శాతం వారసత్వ, అసైన్డ్, సాదాబైనామా సమస్యలే..
- ఇప్పటిదాకా పరిష్కరించినవి 930 మాత్రమే
- ఆగస్టు 15 నాటికి కొలిక్కి తెస్తామని ప్రభుత్వం హామీ

భూపాలపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల భూ సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారం దొరుకుతుందని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ధరణి పేరిట గత ప్రభుత్వం తెచ్చిన పోర్టల్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో భూముల సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ముఖ్యంగా పట్టా, కబ్జా, సరిహద్దు వివాదాలు, ప్రభుత్వం సేకరించిన పట్టాల్లో భూ కమతాల విభజన పరమైన సాంకేతిక సమస్యలు తలెత్తగా ఇప్పుడు కూడా అవే సమస్యలు దరఖాస్తుదారులను వెంటాడుతున్నాయి. గడచిన 75 ఏళ్లలో ప్రభుత్వ భూములు, ఇనాం భూముల గుర్తింపు, నమోదు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం ఫలితంగా వేలాది ఎకరాల్లో రైతులు కబ్జాలో ఉన్నప్పటికీ పట్టాలు మాత్రం వేరే వారి పేరు మీద ఉండటం వంటి పరిణామాలు గ్రామీణ ప్రాంతాల్లో తరచూ ఘర్షణలకు దారితీస్తోంది. అదీ కాకుండా ధరణి పోర్టల్ ప్రారంభానికి ముందు చేపట్టిన అస్తవ్యస్త భూ సర్వే కారణంగా రికార్డుల్లో వాస్తవ పట్టాదారుల పేర్లు తారుమారు కావడం, అసలు ఉన్నారో.. లేరో తెలియని వ్యక్తుల పేర్లు నమోదు చేయడం, తిరిగి వాటిని మార్చేందుకు కార్యదర్శుల స్థాయిలోనే పెద్ద ఎత్తున అవినీతి కార్యకలాపాలు చోటు చేసుకోవడంతో అధికారం చేపట్టగానే కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దుచేసి దాని స్థానంలో భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అయితే భూ భారతి ప్రారంభమైన తర్వాత కూడా పాత సమస్యలే పునరావృతం అవుతుండడంతో దరఖాస్తు చేసుకున్న బాధితులు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అటు రిజిస్ట్రేషన్ల విషయంలోనూ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా మ్యుటేషన్ గిఫ్ట్‌డీడ్, వారసత్వ బదిలీ, జీపీఏ లాంటి లావాదేవీల విషయంలో కూడా సమస్యలు ఎదురవుతున్నాయని అంటున్నారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి మొత్తం 53,763 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 930 దరఖాస్తులు మాత్రమే అధికారులు పరిష్కరించగలిగారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. మిగిలిన 50వేల మందికి నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకున్న భూ సమస్యల దరఖాస్తులకు సంబంధించి అన్నింటినీ ఒక కొలిక్కి తెస్తామని చెబుతున్నా అవి ఏ మేరకు పరిష్కారం అవుతాయో వేచి చూడాల్సిందే.

**మండలాల వారీగా అందిన దరఖాస్తులు**

| | |
|---|---|
| భూపాలపల్లి | 10,553 |
| చిట్యాల | 5,570 |
| గణపురం | 5,042 |
| కొత్తపల్లి(గోరి) | 3,373 |
| మొగుళ్లపల్లి | 2,565 |
| టేకుమట్ల | 1,534 |
| కాటారం | 5,610 |
| మహదేవపూర్ | 2,917 |
| మహాముత్తారం | 4,687 |
| మల్హర్ | 5,372 |
| పలిమెల | 1,428 |
| రేగొండ | 5,112 |



మూసివేసిన సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లు

## సమ్మక్కసాగర్ బ్యారేజీ గేట్ల మూసివేత

కన్నాయిగూడెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజీ గేట్లను మూసివేసి నీటిని నిల్వ చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటిపారుదల శాఖ అధికారులు క్రమక్రమంగా గేట్లను మూసివేస్తూ వస్తున్నారు. బుధవారం బ్యారేజీలోని 10 గేట్లను మూసిన అధికారులు, గురువారం ఉదయానికి మరో 20 గేట్లను మూసివేశారు. మరలా తిరిగి మధ్యాహ్నం 3గంటల కల్లా మరో 17 గేట్లను మూసివేశారు. ఎగువ నుంచి 1,07,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీలో మొత్తం 47 గేట్లు మూసివేసి 12 గేట్ల ద్వారా 93,920 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బారేజీ వద్ద 74.95 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

## మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 75,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద నీటి మట్టం 1.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

## డల్లాస్ ఐవోసీ సమావేశానికి హాజరైన ఇందిర



డల్లాస్‌లో ఇందిరకు స్వాగతం పలుకుతున్న ఐఓసీ ప్రతినిధులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఏలో డల్లాస్ పట్టణంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐవోసీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, రాజకీయ పరిణామాలు, భవిష్యత్తు పార్టీ కార్యచరణ అనే పలు అంశాల పైన సదస్సుల్లో ఆమె వివరించారు. కార్యక్రమంలో సింగపురం ఇమ్మానుయల్ రాజ్, ఐఓసీ సౌత్ వెస్ట్ ప్రెసిడెంట్ గురుదేవ్, కన్వీనర్ నీరజ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ అచ్యుత్ జనరల్ సెక్రటరీ రమణారెడ్డి, కోశాధికారి కంచర్ల భగీరథ, టీపీసీసీ సభ్యుడు సూర్యోదరాహుల్, వేణు, శ్రీధర్ పాల్గొన్నారు.

## పలు రైళ్లకు బోగీల పెంపు

కాజీపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు బోగీలు పెంచుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12705/6) గుంటూరు నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు అప్ అండ్ డౌన్ ట్రిప్పులకు చైర్‌కార్, 01, 3ఏ (ఈ)- 01 రెండు బోగీలను ఈ నెల 12 నుంచి పెంచుతున్నారు. (12757/58) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అప్ అండ్ డౌన్ ట్రిప్పులకు 3ఏ (ఈ)-01 ఒక బోగీని ఈ నెల 11 నుంచి పెంచుతున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు.



# మ్యూచువల్ టీచర్ల దుమ్మాలు

● పాఠశాలలకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆరోపణలు ● స్ట్రాంగ్ టీచర్ల పేరుతో కొందరి హంగామా
● సంఘాల పేరుతో హల్‌చల్ ● కాటారం సబ్‌డివిజన్‌లో ఉపాధ్యాయుల తీరుపై చర్చ

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని పలు మండలాలకు మ్యూచువల్ బదిలీల ద్వారా వచ్చిన ఉపాధ్యాయుల తీరు తీవ్ర చర్చనీయాంశమవుతోంది. ఒకరిద్దరు మినహాయించి ఆయా కాంప్లెక్సుల పరిధిలో వీరు చేసే హంగామా అంతా ఇంతా కాదనే చర్చ నడుస్తోంది. ప్రధానంగా మారుమూల మండలమైన పలిమెల, మహాముత్తారం, మల్హర్ మండలాల్లోకి వచ్చిన వారి గురించైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

హనుమకొండ, కరీంనగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలు, సమీప పాఠశాలల్లో పోస్టింగ్ కోసం పలువురు స్పౌజ్ ఉపాధ్యాయులు ప్రయత్నించినప్పటికీ బదిలీలు కాలేదు. దీంతో మ్యూచువల్ పద్ధతిలో బదిలీలకు సిద్ధమవ్వగా ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రాంతాన్ని బట్టి రూ.15లక్షల నుంచి రూ.30లక్షల వరకు తీసుకుని మారుమూల ప్రాంతాలకు బదిలీపై వచ్చినట్లు ఆరోపణలున్నాయి. బదిలీపై వచ్చిన వీరు పలువురు స్ట్రాంగ్ టీచర్లుగా, మరికొందరు పలు ఉపాధ్యాయ సంఘాల పేరుతో చలామణి అవుతూ విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఏ రోజు పాఠశాలలకు సక్రమంగా హాజరవడం లేదని.. హాజరైన వారు కాలయాపన చేస్తూ సమయం గడిపేస్తున్నట్లు సమాచారం. మ్యూచువల్ బదిలీలపై వచ్చిన వారిలో చాలా వరకు సీనియర్ ఉపాధ్యాయులు ఉండగా... ఇక్కడికి వచ్చిరాగానే దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇంకొంత మంది ఉపాధ్యాయులైతే మళ్లీ వారు కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. రవాణా సౌకర్యం సరిగా లేని పలిమెల, మహాముత్తారం, మల్హర్ వంటి మండలాల్లో పర్యవేక్షణ కొరవడటంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా తయారైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకా కొందరు విధుల సమయంలో చెట్టాపట్టాలేసుకుని ఆ ప్రాంతంలో చక్కెర్లు కొడుతున్నట్లు తెలిసింది.

ఇటీవల మల్హర్ మండలంలోని పెద్దతూండ్ల పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు గత కొన్నేళ్లుగా విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులే సదరు ఉపాధ్యాయుడిని తొలగించాలని జడ్పీ సమావేశాల్లో చర్చించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పలువురు విద్యార్థులు సైతం ఆ టీచరు మాకొద్దంటూ మీడియాతో గోడు వెల్లబోసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇది ఒక్క కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఇదే ట్రెండ్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇంకా కొంత మందైతే ఒక్కో ఉపాధ్యాయుడి వద్ద నుంచి మూడు సంఘాల సభ్యత్వాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ సభ్యత్వం తీసుకోకపోతే సంఘంతో నీకు పని ఉండదా.. సంఘం నిన్ను చూసుకుంటుందిలే అంటూ స్వీట్ వార్నింగ్స్ ఇచ్చి వసూలు చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.



ఢిల్లీలో బిట్ల శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

## కాంగ్రెస్ నాయకులకు రాఖీ కట్టిన సీతక్క

కొత్తగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లెపు రంజిత్ ఢిల్లీలో గురువారం పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఢిల్లీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ రిజర్వేషన్ ధర్నాకు బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు సుంకరబోయిన మొగిలి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ పాల్గొన్నారు. గురువారం అక్కడ మంత్రి సీతక్కను వారు కలిశారు. శ్రీనివాస్, రంజిత్‌కు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. వారితో పాటు కొత్తగూడ మండల ప్రజలకు సీతక్క రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ఈజీఎస్ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాలకృష్ణ

కాటారంలో ఈజీఎస్ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీవో బాలకృష్ణ అన్నారు. కాటారంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదికను గురువారం నిర్వహించగా రాత్రి వరకు సాగింది. 2024 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన సుమారు రూ.8.5 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల నివేదికలను ప్రజావేదికలో డీఆర్‌పీలు చదివి వినిపించారు. పలు చోట్ల పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు, నాటిన మొక్కలు అధిక శాతం చనిపోయినట్లు, మస్టర్ రోల్స్‌లో కొట్టివేతలు ఉన్నట్లు తెలిపారు. కూలీలకు వేతనాలు, మస్టర్లలో తేడాలున్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎస్టిమేట్ కాస్ట్ కన్నా అధికంగా పేమెంట్ జరిగిందని, మస్టర్ రోల్స్‌లో కొట్టివేతలు ఉన్నాయని ఆక్షేపించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని, నిధులను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు రికవరీ చేస్తామన్నారు.

### పూర్తిగా అందని రికార్డులు

మండల వ్యాప్తంగా 24 జీపీల్లో ఈజీఎస్ నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అన్ని పనులకు సంబంధించిన రికార్డులను అధికారులు తమ తనిఖీ బృందాలకు ఇవ్వలేదని సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ కవిత తెలిపారు. సుమారు రూ.4కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు సంబంధించి కొన్నింటి రికార్డులు, ఎంబీలు ఇవ్వకపోవడంతో సోషల్ ఆడిట్ పూర్తిగా జరగలేదని ప్రజావేదిక దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులు స్పందించి త్వరలోనే వాటి ఆడిట్ జరిగేలా చర్యలు తీసుకుటామన్నారు.

### రూ.80,814 రికవరీకి ఆదేశాలు

మండలంలో జరిగిన 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్‌పీలు నివేదికల్లో మస్టర్ రోల్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, కొలతల్లో తేడాలతో పాటు పలు అంశాలపై ఈజీఎస్ అధికారులు, ఎఫ్‌ఏలు, కార్యదర్శుల నుంచి డీఆర్‌డీవో రూ.80,814 పెనాల్టీ రికవరీకి ఆదేశించారు. 24 జీపీలకు సంబంధించి ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ఎఫ్‌ఏల నుంచి పెనాల్టీ రూపంలో రికవరీకి ఆదేశించినట్లు డీవీవో రుబీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిర్మల, ఎంపీడీవో అడ్డూరి బాబు, అంబుడ్స్‌మెన్ ఎస్‌టీఎం శ్రీనివాస్, జిల్లా విజిలెన్స్ అధికారి రుబీనా, క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, ఏపీవో వెంకన్న, ఎస్‌ఆర్‌పీ కవిత, జీపీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 10 మండల కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, అదనపు కలెక్టర్ పి.పింకేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపి సేవలు అందిం చేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆపై విద్యార్హత కలిగి, తెలంగాణ పారా మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగిన వారు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

●ఏఎన్‌ఎం పోస్టుకు..

జనగామ మండలం చౌడారం కేజీబీ వీలో ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషలాఫీసర్ రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ హాస్టల్‌లో ఖాళీగా ఏఎన్‌ఎం పో స్టును ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నామని, వేతనం నెలు రూ.7,800 చెల్లిస్తామని, ఇంటర్ విత్ ఏఎన్‌ఎం విద్యార్హతతో ఆసక్తి గల మహిళా అభ్యర్థులు 11 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 90109 31250 నంబరులో సంప్రదించాలన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జనగామ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన జనగామలో చోటు చేసుకుంది. పెద్దపహాడ్‌కు చెందిన తాళ్ల సిద్దులు(50) మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం జనగామలోని బీఎస్‌ఎన్‌ఎల్ సమీపంలో బస్ షెల్టర్‌లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ దామోదర్ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు అక్కడికి చేరుకుని మృతిదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిద్ధులుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచార మిచ్చారు. అనంతరం వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, సిద్ధులు భార్య గతంలోనే చనిపోగా, ఇద్దరు కుమారులున్నారు.

## బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కరీమాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తూ, ఇవ్వకుంటే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన సంగు గోవర్ధన్‌రెడ్డి అతడి భాగస్వాములు ఖిలావరంగల్ శివారులో భూమిని కొనుగోలు చేసి అందులో ప్లాట్లుగా విడగొట్టి విక్రయించారు. ఈ వ్యవహారంలో ఉర్సు ప్రాంతం కాశికుంట ప్రాంతానికి చెందిన బండి సుభాష్ రియల్ ఎస్టేట్ చేస్తున్న గోవర్ధన్, అతడి భాగస్వాములకు పలుమార్లు ఫోన్ తాను మూడు జిల్లాలకు నక్సలైట్ కార్యదర్శిగా పనిచేశానని, తన వద్ద తుపాకీ ఉందని, మీరు చేస్తున్న రియల్ ఎస్టేట్ ప్లాట్ల అమ్మకాల్లో తనకు పావు వాటా ఇవ్వాలని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయమై గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, గురువార సుభాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

# విచ్చలవిడి వ్యాపారం

● బిల్లులు లేకుండానే పురుగుమందుల విక్రయాలు
● చోద్యం చూస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
● నామమాత్రపు తనిఖీలతోనే సరి



మహదేవపూర్ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్, పలిమెల మండలాల్లో పురుగు మందుల విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రం సహా గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటైన పురుగుమందుల దుకాణాలు అర్హతలు లేకుండానే విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అనుమతులు ఒకరి పేరుంటే.. దుకాణాల్లో సంబంధం లేని వ్యక్తులు విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో రైతులకు బిల్లుల మీద అవగాహన లేకపోవడంతో నిర్వాహకులు రైతుల నుంచి అందినకాడికి దండుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతులు పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు అరువునకు తెస్తుండటంతో బిల్లుల అడిగే పరిస్థితి లేదని, ఒక వేళా అడిగితే ముందు డబ్బులు కడితే బిల్లు అప్పుడిస్తామని బదులిస్తున్నట్లు తెలుస్తోంది. అవగాహన లేని వ్యక్తులు విక్రయాలు చేపట్టుతుండటం, వాటికి బిల్లులు కూడా ఇవ్వకపోతుండటంతో రైతులు తమ పంటలను మొక్క దశలోనే కోల్పోతున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల మండల పరిధిలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో రైతు కొనుగోలు చేసిన పురుగు మందు పిచికారీ చేయడంతో సుమారు రెండెకరాల వరకు పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిసింది. మీరిచ్చిన మందులు వాడటంతోనే పంట నష్టపోయానని రైతు వెళ్లి అడగ్గా దిక్కున్నచోట చెప్పుకో అంటూ వ్యాపారి దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. మళ్లీ గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ జరగ్గా నష్టపోయిన పంటకు పరిహారం ఇచ్చేందుకు ఫర్టిలైజర్ షాపు యజమాని ముందుకు వచ్చినట్టు తెలిసింది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఇటీవల పదుల సంఖ్యలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. రైతు సమస్యలపై స్పందించాల్సిన మండలాధికారి కనీసం ఫోన్ చేసినా ఎత్తడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. అలాగే అధికారులు కార్యాలయానికి సమాయానికి రావడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇన్ని జరుగుతున్నా నామామాత్రపు తనిఖీలు చేసి ఫొటోలకు పోజులిచ్చేందుకే పరిమితమవుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పలిమెల, మహదేవపూర్ మండలాల పరిధిలోని దుకాణాదారులు సర్టిఫికెట్లు పరిశీలించి, నిత్యం తనిఖీలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# కేసముద్రంలో దొంగల ముఠా

●30 పందులు ● బైక్ అపహరణ



పందులను తీసుకువెళ్తున్న అగంతకులు

కేసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేసముద్రంలో మంగళవారం రాత్రి దొంగల ముఠా ఒకటి సంచరించింది. ఆర్వోబీ సమీపంలోని కాలనీలో శివరాత్రి సతీష్‌కు చెందిన రూ.4లక్షల విలువైన 30 పందులను రాత్రి గుర్తుతెలియని వ్యక్తు లు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ గురువారం తెలిపారు. సదరు వ్యక్తులు పందులను స్థానిక బ్రాందీషాపు పక్కన సందులోకి నడిపించుకుంటూ వెళ్లినట్లుగా సీసీ ఫుటేజీలు లభించాయి. అలాగే జూనియర్ కళాశాల సమీపంలో తండ అనీల్ తన పల్సర్ బైక్‌ను ఇంటిపక్కన సందులో నిలిపి ఉంచగా దానిని సైతం ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీసీ ఫుటేజీలో ఆరు నుంచి ఏడుగురు వ్యక్తులు గుంపుగా వచ్చి పందులతోపాటు బైక్ తీసుకువెళుతున్నట్లు కనిపినట్లు బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా పందులను ఎత్తుకెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# బయ్యారంలో ఆరుగురిపై..

బెదిరింపు కేసు నమోదు, రిమాండ్

బయ్యారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌లో వేచియున్న ముగ్గురిని బెదిరించిన ఘటనలో ఆరుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గార్ల గ్రామానికి చెందిన అన్వర్ పాష, గోపిచంద్‌లు ఇల్లెందుకు చెందిన ఉస్మాన్ పాషను బస్ ఎక్కించేందుకు ఈ నెల 5 రాత్రి సుమారు 11 సమయంలో బయ్యారం మండలం గంధంపల్లి బస్టాండ్ సెంటర్‌లో వేచియున్నారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న బయ్యారం మండలం కస్తూరీనగరం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మురళీకృష్ణ, వేణుబాబు, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, వుస్యా, రమేష్ ఒకకారు, ద్విచక్ర వాహనంపై వచ్చి గొడవపడుతారు. ఎవర్రా మీరు.. ఏ ఊరు మీది.. ఇక్కడ ఎందుకు ఉన్నారంటూ ఉస్మాన్ పాష, అనర్వర్ పాష, గోపిచంద్‌లను బెదిరించారు. అంతేకాకుండా వారి వద్ద నుంచి రూ. 2 వేలు నగదు, ఒక సీసీ కెమెరాతో పాటు ఒక టార్చిలైట్ స్వాధీనపరుచుకొని ముగ్గురు వ్యక్తులను మోకాళ్లపై కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ఉస్మాన్ పాష 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా.. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకునేలోపు పై 6 గురు నిందితులు అక్కడి నుంచి పారిపోయినట్లు ఎస్సై వెల్లడించారు. ఉస్మాన్ పాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మురళీకృష్ణ, వేణు, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, వుస్యా, రమేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు. మురళీకృష్ణను గురువారం కోర్టులో రిమాండ్ పరచగా, మిగిలిన 5 గురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒకకారు, ద్విచక్ర వాహనం స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. కాగా, ఎవరైన ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు | 2151 | 1521 |
| పల్లికాయ (సూక) | 5670 | 3450 |
| పల్లికాయ (పచ్చిది) | 4500 | 1575 |
| కందులు | 5873 | 3022 |
| పెసళ్లు | 7022 | 3022 |
| పత్తి | 7660 | 5300 |
| పసుపు (కాడి) | 12003 | 9534 |
| పసుపు (గోల) | 10180 | 8700 |
| తేజ మిర్చి | 11500 | 8500 |
| తేజ ఏసీ | 13800 | 11500 |
| వండర్‌హాట్ | 12000 | 6000 |
| వండర్‌హాట్ ఏసీ | 15500 | 11500 |
| యూఎస్341ఏసీ | 14500 | 7000 |
| దీపిక | 9000 | 8000 |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 6000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# అనుబంధాల వేడుక..

# ఆత్మీయతల వేదిక



## రేపు రక్షాబంధన్ పర్వదినం

- పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు
- ఇంటింటా కనిపిస్తున్న సందడి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అన్నాచెల్లెల ఆత్మీయఅనుబంధానికి ప్రతీక రాఖీ పర్వదినం. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేకంగా నిలిచాయి. కుందన్‌లు మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టున్ రాఖీలు కూడ వచ్చాయి. పాతకాలంలో అతి పెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారి పోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్ద పెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనిమిచ్చాయి. దూరప్రాంతాల్లో ఉన్న సోదరులకు సోదరీమణులు కొరియర్, పోస్ట్ ఆపీసుల ద్వారా ముందుగానే రాఖీలు పంపించారు. కాగా రూ.10 నుంచి మొదలుకుని 300 వరకు రాఖీ ధరలు పలుకుతున్నాయి.

### పుట్టింటికి చేరుకుంటున్న ఆడపడుచులు

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు ఈ ఏడాది రాఖీ పర్వదినాన్ని సుఖఃసంతోషాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 8వ తేదీ నాటికే పుట్టింటికి చేరుకునేందుకు తరలివస్తున్నారు. రాఖీ పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి, జంజాల పౌర్ణమి కూడా అంటారు. 9న పౌర్ణమి తిథి కాబట్టి ఈ రోజే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు. సోమవారం రాఖీ పర్వదినాన్ని జరుపుకోవచ్చనే పండితుల సూచనల మేరకు ఆడపడుచులు రాఖీలు, స్వీట్లతో పుట్టింటికి చేరుకుంటున్నారు. పంచాంగం ప్రకారం ఈనెల 9న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల రాఖీ పండుగను జరుపుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు. ఆ సమయంలో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టవచ్చని పండితులు తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో రాఖీ పర్వదినం రోజున భక్తులతో కిటకిటలాడనున్నాయి. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి సోదరులకు రాఖీలు కట్టనున్నారు. దీంతో జిల్లా కేంద్రం, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో కూడా పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాఖీ పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారనున్నాయి.

### హిందూ పండుగల్లో ఒకటి..

హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ పండుగ సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీ కట్టి స్వీటు తినిపించి హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. ఈ పండుగ ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రక్షాబంధన్ అనే పదం రక్ష, బంధన్ అనే రెండు పదాలతో ఏర్పడింది. దేవతామూర్తుల కాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది.

### ఎందుకు జరుపుకుంటారంటే..

ఒక రోజు శ్రీగణేశుడు తన సోదరి మానసదేవితో రాఖీ కట్టించుకుంటుండగా అప్పుడు ఇద్దరు కుమారులు శుభ్, లాబ్‌లు ఇది ఏంటని అడిగారట. అప్పుడు గణేశుడు ఇది రక్షణ కవచం అని, ఈ రక్షాసూత్రం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక అని చెప్పాడట. ఇది విన్న శుభ్, లాభ్‌లు తమకి కూడా ఒక సోదరి కావాలని పట్టుబట్టగా తన కుమారుల కోరిక మేరకు గణేశుడు తన శక్తుల నుంచి ఒక మంటను సృష్టించి దానిని తన భార్యలు సిద్ధి, బుద్ధిల ఇద్దరి ఆత్మశక్తితో కలిపి ఆ వెలుగు నుంచి ఒక అమ్మాయి జన్మించింది. ఆ అమ్మాయికే సంతోషిమాత అని పేరు పెట్టారట.



వరంగల్ చౌరస్తాలో పూజ సామగ్రి కొనుగోళ్ల సందడి

# నేడు వరలక్ష్మి వ్రతం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఇంటింటా మహిళలు వ్రతాలు
- పూజ సామగ్రి కొనుగోలుతో నగరంలో సందడి

వరంగల్ కల్చరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరాలిచ్చే తల్లి వరలక్ష్మీ తమ సౌభాగ్యం పసుపు కుంకుమలు ముత్తైదువ తనంతో ఇంటిల్లిపాది అందరు సుఖ సంతోషాలతో ఉండాలని వరలక్ష్మీని వేడుకుంటూ శుక్రవారం రోజు వ్రతాలను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఇంటింటా ఆచరించకోనున్నారు. ప్రతీ ఏడు శ్రావణ మాసంలో మూడో శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించుకుంటారు. ఈ మాసంలో రాజరాజేశ్వరీ దేవాలయంలో ఐదు శుక్రవారాలు సాముహికంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళల చేత నిర్వహిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని నగరంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు వ్రతాలు నిర్వహిస్తారు. ప్రధానంగా భద్రకాళీ దేవాలయం రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ సంతోషీమాత దేవాలయం, శ్రీ వరద దత్తక్షేత్రం మహాలక్ష్మీ, వాసవీ మాత దేవాలయంతోపాటు ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఇంటింటా మహిళలు వ్రతాలు నిర్వహించుకోవడానికి కావల్సిన పూజా సామగ్రి కొనుగోలుతో నగరంలోని బజార్లు కిటకిటలాడాయి. వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, స్టేషన్‌రోడ్డు, అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో పూజా సామగ్రి అమ్మకాలు విక్రయించారు. వ్రతానికి పూలు, పండ్లు కొనుగోళ్లు పెద్దఎత్తున చేశారు. వీటితోపాటు అమ్మవారి ప్రతిమలు నూతన వస్త్రాలు, మిఠాయిల అమ్మకాలతో సందడిగా కనిపించాయి. శ్రావణ మాసం ఆధ్యాత్మిక శోభతో వరాల వరలక్ష్మీ అమ్మవారి వ్రతాల సందడి కనిపించింది.



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

# ప్రజావాణితో ప్రయోజనమేది ?

- జీడబ్ల్యూఎంసీలో దరఖాస్తులు బుట్టదాఖలు
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు ఎక్కువ
- పట్టించుకోని అధికారులు
- సీరియస్‌గా తీసుకోవాలంటున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) సమర్థవంతమైన పాలన అందించాలంటే ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలి. కానీ బల్దియాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రయోజనంగా లేదని బాధితులు విమర్శిస్తున్నారు. గ్రీవెన్ సెల్‌కు హాజరైనా ప్రజల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్ ముందు సమస్యలు పరిష్కరిస్తున్నట్లు నటిస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రజావాణి అధికారులకు తూతూ మంత్రంగా మారింది. ప్రతీ సోమవారం అన్ని విభాగాలకు 100 నుంచి 150 ఫిర్యాదులు వచ్చినా పావలా వంతు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఫిర్యాదులు స్వీకరించడంలో ఉన్న శ్రద్ధ పరిష్కరించడంలో చూపడం లేదు. కమిషనర్ స్వీకరించిన ఫిర్యాదులు అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి బుట్టదాఖలవుతున్నాయి. ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రతీ వారం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా నగరంలో భవన నిర్మాణాలకు అనుమతులిచ్చి, పుచ్చుకోవడంలోనే అధికారులు బిజీగా ఉంటున్నారని ఆరోపణలొస్తున్నాయి. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, భూ కబ్జాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అనధికార లేఔట్లు, రోడ్ల ఆక్రమణలు, ఖాళీ స్థలాల ఆక్రమణ, వ్యక్తిగత కక్షలతో ఇళ్ల, ప్రహరీల కూల్చివేతలపై ఫిర్యాదులు నిత్యకృత్యంగా మారాయి. నగరవాసుల సమస్యలను పరిష్కరించడంలో సీపీ నుంచి చైన్‌మన్ వరకు సరైన స్పందన లేక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### పట్టించుకోని అధికారులు

ప్రజావాణి ద్వారా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గంపెడాశతో వచ్చిన ఫిర్యాదుదారులకు నిరాశే మిగుతుంది. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, ఇంజనీరింగ్, తాగునీటి సమస్యలపై ప్రతీ వారం పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందుతాయి. శానిటేషన్ విభాగంలో చెత్త కుప్పల తొలగింపు, డ్రెయినేజీల శుభ్రం, జంతు కళేబరాల తొలగింపు ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగంపై వచ్చిన సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కార మార్గాలు చూపించాల్సిన అధికారులు, సిబ్బంది అటుగా వెళ్లడం లేదు. ప్రజలు పదులసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సమస్య అడిగి తెలుసుకుని పరిష్కారం చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ పంపించి చేతులు దులుపుకుంటున్నట్లు బాధితులు తెలిపారు. ఇంకా కొందరు అధికారుల డబ్బులు ముట్టజెప్పితేనే ఫీల్డ్ విజిట్ చేస్తామని మొండికేస్తున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రక్షాళన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తేనే కమిషనర్, మేయర్‌పై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందనేది వాస్తవం.



బల్దియాలో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, అధికారులు (ఫైల్)

### గత 6 నెలలుగా అందిన ఫిర్యాదులు

- ఇంజనీరింగ్ - 180
- హెల్త్, శానిటేషన్ - 63
- ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 90
- టౌన్‌ప్లానింగ్ - 289
- తాగునీటి సరఫరా - 38
- హార్టికల్చర్ - 14
- ఎలక్ట్రికల్ - 32
- డీఆర్ఎఫ్- 30

వరంగల్ మంత్రి, ఎమ్మెల్యేలు, మేయర్, కమిషనర్‌తో పాటు ఆన్‌లైన్‌లో 450 ఫిర్యాదులు అందాయి. మొత్తంగా 1, 186 ఫిర్యాదులు అందగా 200 ఫిర్యాదులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు.

### ప్రజావాణితో పాటు పర్సనల్‌గా..

నగరవాసులు వారి సమస్యలను ప్రజావాణిలో కమిషనర్, మేయర్, ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లకు అందిస్తున్నారు. కొందరు బల్దియా ద్వారా పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వారు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చెబుతున్నారు. అయినా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై ప్రజలకు ఆశలు సన్నగిల్లుతున్నాయి.

### ప్రజావాణిపై ప్రజల డిమాండ్లు..

- ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై 10 రోజులలో పరిష్కారం చూపాలి.
- కమిషనర్ స్వీకరించిన ఫిర్యాదుల పెండింగ్‌పై ప్రతీ నెల చివరి వారంతో అధికారులతో సమీక్షించాలి.
- టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి.
- ప్రతీ ఫిర్యాదుదారుడికి అక్‌నాల్డ్‌మెంట్ ఇచ్చే విధానం అమలులోకి తేవాలి.
- ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాలపై స్వచ్ఛంద సంస్థలు, భూ బాధితులతో కమిటీలు వేయాలి.
- కబ్జాదారులపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.
- డిజిటల్ ఫిర్యాదు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి.
- ఫిర్యాదులపై దర్యాప్తు అధికారి పేరు, ఫోన్ నెంబర్ వెల్లడించాలి.
- అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి.

### బల్దియాలో సమస్యలు పరిష్కారం కాక మా వద్దకు వస్తున్నారు..

**- తోట వెంకటేశ్వర్లు, 10 డివిజన్ కార్పొరేటర్**



ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుగా మునిసిపాలిటీకి వెళ్తే అక్కడి అధికారులు జాప్యం చేయడంతో మా వద్దకు వస్తున్నారు. మేము ఎమ్మెల్యే, మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిస్తే మా వద్దకు రాకుండా ఉంటారు. అధికారుల నిర్లక్ష్యంపై కమిషనర్, మేయర్ దృష్టి సారించాలి.

### రోడ్డు కబ్జా అయ్యిందని పదిసార్లు ఫిర్యాదు చేశాం..

**- హారిక, మడికొండ**



గ్రేటర్ 64వ డివిజన్ మడికొండ హిల్స్‌కాలనీలో కొందరు రోడ్డును ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని పదిసార్లు ఫిర్యాదు చేశాం. మా కాలనీవాసులు సుమారు 20 మంది ప్రతీ ప్రజావాణిలో వచ్చి ఫిర్యాదు చేస్తున్నాం. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఇంతవరకు ఒక్క అధికారి కూడా వచ్చి చూడలేదు. కమిషనర్ స్పందించి ప్రజల ఫిర్యాదులకు పది రోజుల్లో పరిష్కారం చూపాలి.

# హామీలు నిలబెట్టుకోవాలి

- ఆంధ్రప్రదేశ్‌లా పింఛన్ పెంచాలి
- లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతాం..
- పింఛన్‌దారుల సన్నాహక సభలో మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

హసన్‌పర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్నికలకు ముందు సీఎం రేవంతర్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండలంలోని భీమారం ఎంటీఆర్ గార్డెన్స్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం పెన్షన్‌దారుల సన్నాహక మహాసభ వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వికలాంగులకు పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు, వృద్ధులు, వితంతువులకు రూ.2016 నుంచి రూ.4 వేలకు, కండరాల క్షీణత రోగులకు, ఇతర తీవ్రమైన రోగులకు రూ.15 వేలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వలాగా పెంచి తెలంగాణ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హెచ్చరించారు. అందాల పోటీలకు, భూస్వాములకు రైతు భరోసాకు అభివృద్ధి పేరుతో వేల కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు.. కాళ్లు, కళ్లు, మాట్లాడలేని వికలాంగులకు, వయసు మీద పడిన వృద్ధులకు, భర్త లేకుండా బిడ్డలను పోషించలేని వితంతువులకు, తీవ్రమైన రోగాలతో చావుతో సాహసం చేస్తున్న కండరాల క్షీణత ఇతర రోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్న ఆ సమాజానికి సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పు తెలుసుకొని మొదటి వారం లోపు 15 డిమాండ్స్ తీర్చకపోతే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో లక్షలాది మందితో జరిగే మహాగర్జన మహాసభతో కుప్పకూల్చుతామని హెచ్చరించారు. పేద వర్గాల పింఛన్ పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా అన్యాయం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష, విపక్ష పార్టీలు మౌనం వీడాలని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, వికలాంగుల, వృద్ధులు, వితంతువుల పింఛన్ రూ.200 నుంచి రూ.వేయి, రూ.1500 నుంచి రూ2వేలు సాధించుకుని ఆంధ్రప్రదేశ్‌లో నేడు రూ.6 వేలు సాధించామన్నారు. ఆ స్ఫూర్తితో తెలంగాణలో కూడా పింఛన్ రూ.6 వేలకు పెంచడంతో పాటు ఇతర డిమాండ్స్ సాధించే వరకు విశ్రమించే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే.విశ్వనాథ్ మాదిగ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆరెపల్లి పవన్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు భిక్షపతిమాదిగతో పాటు జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పాల్గొన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 21మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 18 మందికి రూ.21,000 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న ఇద్దరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 1,400 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

# హార్టికల్చర్ భూములకు మహర్దశ

- ఉద్యానవన పంటల సాగుకు ఐటీడీఏ మొగ్గు
- కార్యాచరణను సిద్ధం చేస్తున్న అధికారులు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి నిరాదారణకు గురైన భూములకు చలనం కల్గింది. ఐటీడీఏ నిర్లక్ష్యానికి విలువైన భూములు గత పదేళ్లుగా బీడుగా మారాయి. నిరుపయోగంగా మారిన భూముల్లో సాగుకు ఐటీడీఏ ముందడుగు వేసింది. ఐటీడీఏ ఉద్యానవన శాఖకు చెందిన భూముల్లో ఉద్యాన పంటల సాగుకు కసరత్తు చేస్తుంది. ఖాళీగా ఉన్న భూముల్లో పండ్లు, పూల, కూరగాయల సాగుకు ఐటీడీఏ పీవో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు 32 ఎకరాల్లో పండ్లు, పూలు, కూరగాయల సాగుతో పాటు వెదురు లాంటి చెట్లను పెంచనున్నారు.

### ఎట్టకేలకు భూములకు మోక్షం

ఐటీడీఏ ఉద్యానవన శాఖకు సుమారు 35 ఎకరాల భూములున్నాయి. గతంలో ఈ భూముల్లో పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు పెంపకాన్ని చేపట్టి గిరిజనుల ఉపాధికి బాటలు వేశారు. కానీ గత పదేళ్లుగా ఉద్యానవన శాఖ నిర్లక్ష్యానికి గురైంది. సంవత్సరాల తరబడి ఈ భూములు బీడుగా మారాయి. విలువైన భూములపై ఐటీడీఏ అలసత్వం ప్రదర్శించింది. మండల కేంద్రంలోని రామన్నగూడెం వెళ్లే రహదారిని ఆనుకొని సుమారు 6 ఎకరాలు భూమితో పాటు ఎక్కెలలోని 28 ఎకరాల్లో భూమి ఉంది. కానీ ఈ భూములపై ఐటీడీఏకు పట్టింపు కొరవడంతో భూములు కొంతమేర కబ్జాకు గురయ్యాయి. పలుమార్లు గిరిజనులు భూములను సాగులోకి తెస్తే తమకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఐటీడీఏ అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం ఐటీడీఏ ఈ భూములపై నజరు పెట్టింది. విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా పీవో చిత్రా మిశ్రా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆ భూములపై రీసర్వేను చేపట్టి హద్దురాళ్లు వేసేందుకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చింది. గతంలోని భూముల విస్తీర్ణం, ఇప్పుడున్న పరిస్థితిని సర్వే చేసి కబ్జాకు గురైన వాటిని స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. నిరుపయోగంగా మారిన భూముల్లో ఉద్యానవన పంటల సాగుకు ముందుకు రావడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రామన్నగూడెం రోడ్డులోని భూమిని చదును చేస్తున్న దృశ్యం

### 18 ఎకరాలు.. ఒక్కో ఎకరంలో ఒక్కో రకం

మండల కేంద్రంలోని ఎక్కెల గల హెచ్‌టీసీలో గల 18 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగును చేపట్టనున్నారు. 18 ఎకరాల్లో ఒక్కో ఎకరంలో ఒక్కో రకం పండ్ల తోటలను వేయనున్నారు. మామిడి, సీతాఫలం, నిమ్మ, బత్తాయి, ఫామాయిల్, ఆపిల్‌బేర్, మునగ, నేరేడు, జామ, సపోటా తదితర పండ్ల మొక్కలను 18 ఎకరాల్లో సాగు చేయనున్నారు. మామిడి 3 ఎకరాలు, సీతాఫలం 1, ఫామాయిల్ 2, నిమ్మ 1, బత్తాయి 1, ఆపిల్ బేర్ 1, నేరేడు 1, మునగ 1, జామ 3, సపోటా 1 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటనున్నారు. అదేవిధంగా హెచ్ఎన్‌సీటీలో గల పాత చెట్లను పునరుద్ధరణతో పాటు రామన్నగూడెం రోడ్డులోని భూముల్లో మామిడి మొక్కల పునరుద్ధరణతో పాటు పూలమొక్కలను సాగు చేయకున్నారు. ఇందుకోసం జిల్లా ఉద్యానవన శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పండ్ల మొక్కల సాగు చేసేందుకు సంబంధించిన భూములను అధికారులు చదును చేస్తున్నారు. సాగుకు సంబంధించిన పనులను వేగంగా జరుగుతున్నాయి.



భూమిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా (ఫైల్)

### గిరిజనుల ఉపాధికి ఊతం

హార్టికల్చర్ భూములు ఉపయోగంలోకి రావడంతో స్థానిక గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండ్లు, కూరగాయాలు, పూలమొక్కల పెంపకం చేపట్టి తద్వారా వచ్చే ఫలితాలతో గిరిజనులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, ఆర్థిక వెసులుబాటు కల్గుతుందని పలువురు గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా బీడుగా మారిన భూములు ఉపయోగంలోకి రావడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

## మిరప నర్సరీలను సందర్శించిన అధికారి

చిట్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లగరిగ, జూకల్లు శివారులో గల మిరప నర్సరీలను జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎడ్ల సునీల్ గురువారం సందర్శించారు. నర్సరీల యాజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, మొక్కలు దెబ్బతినకుండా, రైతులకు నష్టం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీ రిజిస్టర్లను అప్‌డేట్ చేయాలని సూచించారు. మొక్కల పెంపకంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, మిరప నారును 40రోజుల వరకే పెంచాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చిట్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన అజ్మీరా రమేష్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. కాగా, చిట్యాల పోస్టాఫీస్‌లో 11నెలల బీమా ప్రీమియం చెల్లించాడు. కాగా, హనుమకొండ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ హనుమంతు మృతుడి భార్య అజ్మీరా శ్రీలతకు రూ.2,09,600 విలువ గల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ జీవిత బీమా ఉండడం వల్ల యజమాని కుటుంబానికి భరోసా లభిస్తుందన్నారు. పోస్టాఫీస్‌లో పొదుపు, బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దివ్యాంగుల సింహగర్జనను విజయవంతం చేయాలి

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలనే డిమాండ్‌తో ఈనెల 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే దివ్యాంగుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దుమ్ము వెంకటేశ్వర్లు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్గం శంకరయ్య కోరారు. మండలంలోని గంగారంలో గురువారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వెంకటేశ్వర్లు, శంకరయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన విధంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిరంజీవి, వీహెచ్‌పీఎస్ నాయకులు రాజశేఖర్, సత్యం, లావణ్య, సతీష్, సంతోష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం



ములుగు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని పోలీసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో అడ్మిట్ అయినట్లు పేర్కొన్నారు. అడ్మిట్ అయ్యే క్రమంలో తన పేరు బట్టు రాములమ్మ అని, భర్త మల్లయ్య, ఊరు గోరికొత్తపెల్లిగా రికార్డులో నమోదు చేయించిందని పేర్కొన్నారు. కాగా, వైద్యం పొందుతూ ఈనెల 6న మరణించినట్లు తెలిపారు. అయితే ఆమె తెలిపిన అడ్రస్‌లో సంబంధించిన వారు ఎవరూ లేరని, మృతురాలి వివరాలు తెలిస్తే ఈ 8712670082, 8712670081 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా నవ్‌రామ్

మహాముత్తారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామంలో గురువారం లంబాడాహక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షుడు దాసురాంనాయక్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్లగూడెం గ్రామానికి చెందిన మాలోత్ నవ్‌రాంనాయక్‌ను భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా వివిధ విభాగాలకు జిల్లా కమిటీని ఆయన నియమించారు. ఈ సందర్భంగా దాసురాంనాయక్ మాట్లాడుతూ లంబాడీల హక్కుల సాధనకు మనమంతా ఏకం కావాలన్నారు. అనంతరం కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన రాజారాంనాయక్‌ను సన్మానించారు. సమావేశంలో కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజీర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి సమ్మయ్యనాయక్, నాయకులు పడ్డినాయక్, జగపతి, రాజారాం, దన్నునాయక్, ధన్‌సింగ్, తిరుపతి, హీతిరాం, రఘురాం, రుబీస్, జగ్గునాయక్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలి

మల్హర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు రాకుండా ప్రైవేటు వ్యాపారాలు చూసుకుంటూ వేతనం పొందుతున్న పెద్దతూండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పిన్నింటి వెంకటేశ్వర్‌రావును వెంటనే విధుల నుంచి తొలగించాలని తెలంగాణ ప్రజాఫంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం తాడిచర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ ఉపాధ్యాయుడికి కొమ్ముకాస్తున్న డీఈవోను సస్పెండ్ చేయాలన్నారు. మంత్రి ఇలాకాలో ఇలాంటి ఉపాధ్యాయుడు ఉండటం, మూడేళ్లుగా ఉపాధ్యాయుడి విషయంలో నిద్రమత్తులో ఉండటం విస్మయానికి గురిచేస్తుందన్నారు. ఈసమావేశంలో యూఐఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కోకన్వీనర్ బాపు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే చిన్నారులకు సంపూర్ణ ఆహారం



కాటారం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారి మౌనిక

వెంకటాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగాపూర్, అందుగులమీది గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ ములుగు ప్రాజెక్టు సీడీపీవో శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిశువులకు 6 నెలలు నిండే వరకు తల్లి పాలే సంపూర్ణ ఆహారమని అన్నారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భం ధరించినప్పటి నుంచి తీసుకున్న పౌష్టికాహారాన్ని బట్టి బిడ్డ సంపూర్ణంగా పెరగడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజం అనంతలక్ష్మి,పాఠశాల హెచ్ఎం ఎమ్డీ.సర్వర్ అహ్మద్, డాక్టర్ నవీన్, ఏఎన్ఎంలు వరలక్ష్మి, వజ్ర, శోభారాణి, ఆశా వర్కర్లు రాజ్యలక్ష్మి, కవిత, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, సవిత, మంజుల, రజిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

- వెంకటాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యంతోపాటు పోషకాలు అందుతాయని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. తల్లిపాలు గంటకోసారి తాగించాలని పేర్కొన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు.అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
- మల్హర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతూండ్ల గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, తల్లులకు తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. అలాగే అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, సౌజన్య, భారతి, రమ తదితరులు పాల్గొన్నారు.
- మహాముత్తారం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుపల్లి, పోలారం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులతో సమావేశం నిర్వహించిన అంగన్‌వాడీలు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. టీచర్లు కె.రమ, జి.ప్రమీల, ఉపాధ్యాయులు హనుమంతు, రాజేంద్రప్రసాద్, ఆశావర్కర్లుపాల్గొన్నారు.
- కాటారం(ఆంధ్రజ్యోతి): శిశువులకు 6నెలలు నిండేవరకు తల్లి పాలే వారికి సంపూర్ణ ఆహారమని పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. గురువారం కాటారం పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డను విరోచనాలు, న్యూమోనియా వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయన్నారు. అనంతరం వైద్యులు గంగారం మోడల్ పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమాల్లో డాక్టర్ సుమన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్, హెచ్ఎ మనోరమ, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతకు పుట్ట మధు పరామర్శ

మల్హర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వాల యాదగిరిరావుకు హైదబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స జరగ్గా గురువారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

## జ్వరంతో మహిళ మృతి

వెంకటాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తీవ్ర జ్వరంతో మృతి చెందిన సంఘటన మండలంలోని కమ్మరిగూడెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన పర్శిక అరుణ(31) గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుంది. మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులు అరుణను వరంగల్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో ఏటూరునాగారంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి పరీక్షలు నిర్వహించగా డెంగీ, టైఫాయిడ్‌గా నిర్ధారణ అయింది. ఈ క్రమంలో జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో అరుణను వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

## పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

మల్హర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో 42శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని యాదవ సంఘం మండల ఉపాధ్యక్షుడు రాగం ఐలయ్య గురువారం డిమాండ్ చేశారు. తాడిచర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా బీసీలను ప్రభుత్వాలు బానిసలుగానే చూస్తున్నాయన్నారు. బీసీ బిల్లుకు సహకరించని రాజకీయ పార్టీలు బీసీ ద్రోహులుగా మిగులుతారని అన్నారు.

## ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

గోవిందరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పస్రా పోలీసులు గురువారం మండలకేంద్రంలో వివిధ షాపులు, వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ డాగ్‌తో బస్టాండ్, చౌరస్తా, కిరాణ షాపులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ స్నైపర్‌డాగ్ హత్యలు, దోపిడీల చిక్కుముడులను విప్పడానికి, డ్రగ్స్, పేలుడు పదార్థాలను పసిగట్టి పట్టిస్తుందని అన్నారు. ప్రతిరోజు మండలంలో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంత యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కోసం ఆందోళన చెందవద్దు : కలెక్టర్



చెల్పూరులో యూరియా వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

గణపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మండలంలోని చెల్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, ఎంత ధరకు విక్రయిస్తున్నారు, స్టాకు రిజిస్టర్, రోజువారీ వివరాలను పరిశీలించారు. పట్టాలేని రైతులకు ఆధార్‌కార్డు నమోదు చేసుకుని యూరియా ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఔషధ నిల్వలు, రోగులకు ఇచ్చే సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో ఐలయ్య, వైద్యాధికారి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎరువులను బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

ములుగు రూరల్(ఆంధ్రజ్యోతి): ఎరువులను బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ సురేష్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. గురువారం మండల వ్యవసాయ అధికారి పరమేశ్వర్‌తో కలిసి ములుగులోని పీఏసీఎస్ గోదాములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాము నిర్వాహకులను యూరియా స్టాక్ ఎంత ఉంది? ఇంకా ఎంత అవసరముందని అడిగి తెలుసుకున్నారు. అలాగే గోదాముల్లో సరిపడా నిల్వలు ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమయానికి ఎరువులు అందుతున్నాయా.. అని ఆరా తీశారు. ఎరువుల అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్ట్ ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు సోమిరెడ్డి



ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ములుగురూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు, జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా యూడైస్ ప్లస్‌లో పాఠశాల ఉచితమైన సమగ్ర సమాచారాన్ని పొందుపరచాలని, ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలన్నారు. భవిత కేంద్రాల మైనర్ రిపేర్లు పూర్తి చేయాలని, వాటిలో నిర్వహించే రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు అందించిన పాఠ్యపుస్తకాల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలోని పాఠశాలలను తరచూ సందర్శించాలని ఆదేశించారు. సమావేశంలో జయదేవ్, రాజు, రమాదేవి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## 55 లీటర్ల గుడుంబా పట్టివేత

ఏటూరునాగారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పోలీసులు నిర్వహించిన పెట్రోలింగ్‌లో 55 లీటర్ల గుడుంబా పట్టుబడింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి గుడుంబాను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం 6 గంటలకు ఎస్సై సిబ్బందితో బస్టాండ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచులతో కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 55 లీటర్ల గుడుంబా ఉండడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్టుయిన వారు గోవిందరావుపేట మండలానికి చెందిన జరుపుల శ్రీకాంత్, ఏటూరునాగారం మండల రాంనగర్ గ్రామానికి చెందిన బానోతు చందు, అదే గ్రామానికి చెందిన గుగులోతు మమతగా పోలీసులు గుర్తించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు రవిత్ర, నరేష్, ఏఎస్ఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ బాబాజీ, కానిస్టేబుళ్లు ధ్రువ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్

(5వ పేజీ తరువాయి)

చేస్తుంటారని, ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో నిర్మించిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం మహా అద్భుతం అని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి మీద ఒత్తిడి తీసుకువచ్చి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల మూడో దశ పనులను పూర్తిచేసి ఆయకట్టు ద్వారా రైతులకు సాగునీరందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో అనేక మంది నిరుపేదల ఇండ్లను కూల్చి వేసిందని విమర్శించారు.

గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..వేసవిలో దేవాదుల ప్రాజెక్టు మోటార్లు పూర్తిస్థాయిలో నడవలేదని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వలేదని విమర్శించారు. రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణను కరువు రాష్ట్రంగా మార్చారని రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఒక్క రోజైనా నీళ్ల మీద సమీక్షలు ఎందుకు చేయడం లేదని విమర్శించారు. కాళేశ్వరం మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగాయని, కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలుచేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌పై కక్ష సాధింపుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యపు, అవినీతి ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు, రైతులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు హరి రమాదేవి, దేవమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

(5వ పేజీ తరువాయి)

ప్రతి రోగికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. టీ హబ్‌లో అన్ని రకాల రక్త పరీక్షలు చేసి వాటి రిపోర్టులను, ఆసుపత్రులకు, పాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హాస్పిటల్ అడిషనల్ డైరెక్టర్ గఫార్, టీ హబ్ నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### మలేరియా, డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ సూచించారు. గురువారం ఆయన ఏటూరునాగారం మండలకేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు. వివిధ వార్డులలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ.. ఏటూరునాగారం చుట్టూ గిరిజన గ్రామాలు ఉన్నందున మలేరియా, డెంగీ వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు విధులను నిర్లక్ష్యం చేయకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ సైదులు, ఏఎంవో దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

మంగపేట(ఆంధ్రజ్యోతి):మండలంలోని చుంచుపల్లి, మంగపేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అమర్‌సింగ్ గురువారం తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమల నివారణ చర్యలు చేపట్టినప్పు డే మలేరియా, డెంగీ వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, కేజీబీవీ పాఠశాలల్లో నిత్యం వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి విపిన్‌కుమార్, జిల్లా కీటక, జనిత నియంత్రణ ప్రో గ్రాంఅధికారి చంద్రకాంత్,వైద్యాధికారులు స్వప్నిత, యమున పాల్గొన్నారు.

## నేడు కాళేశ్వరంలో వరలక్ష్మి వ్రతాలు

మహదేవపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన పేర్కొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్నల్ స్లైడింగ్ అనంతరం ఈసీఈ, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయన్నారు. పాలిసెట్-2025లో క్వాలిఫై అయిన, కాని వారు, పాలిసెట్ రాయని వారు కూడా అర్హులేనన్నారు. 10వ తరగతి తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 10వ తేదీ లోగా పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ములుగు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జాకారం ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం జాకారం బస్టాండ్ వద్ద డివైడర్ దాటుతున్న రాజయ్యను లారీ ఢీకొట్టింది. క్షతగాత్రున్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్ళాలని సూచించారని అన్నారు. అయితే రాజయ్య అబ్బాపూర్ గ్రామానికి చెందిన తన బిడ్డ ఇంటి వద్దనే ఉండి, జాకారంకు చెందిన వ్యక్తి వద్ద జీతం ఉండి జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు.

## చిద్నెపల్లిలో విద్యుత్ శాఖ పల్లెబాట

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిద్నెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో 'విద్యుత్ శాఖ-పల్లెబాట' కార్యక్రమాలు చేపడుతున్నట్లు కాటారం సబ్ డివిజన్ ఏడీఈ నాగరాజు తెలిపారు. విద్యుత్ భద్రతలను పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం.. అంటూ రైతులతో కలిసి అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షా కాలంలో రైతులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏఈ ఉపేందర్, లైన్‌మన్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ మండల అధ్యక్షుడిగా అనిల్

టేకుమట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆంజనేయ ఆటో యూనియన్ మండల అధ్యక్షుడిగా టేకుమట్లకు చెందిన కొలుగూరి అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండలకేంద్రంలో యూనియన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా బొండ్లప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఈద భాస్కర్, కోశాధికారిగా ఎమ్డీ.రంజాన్, ముఖ్య సలహాదారులుగా రామగిరి సత్యం, పైతర ఓదెలు, ప్రచార కార్యదర్శిగా కంచర్ల మహేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేందర్, అబ్బ కుమార్, సంపత్, రజాక్, వేణు, రమేష్, ఓదెలు పాల్గొన్నారు.

## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

కాటారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాటారం ఐటీఐ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో 2025-26 సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం స్పాట్(వాక్ ఇన్) అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి, ట్రైనింగ్ ఆఫీసర్ తిరుపతి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఏటీసీలో మ్యానుయఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్ సీఎన్సీ మేషనింగ్ టెక్నిషియన్, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్, టీవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తాడ్వాయి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడారం గ్రామ పరిధిలో ఉన్న దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వర్తక, వ్యాపారులకు పస్రా సీఐ దయాకర్ సూచించారు. వనదేవతల గద్దెల పరిసరాల్లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలను వ్యాపారులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించి డగ్స్, నేర నిషేధిత మండలంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాపారులు రఫిక్, స్వాతిరెడ్డి, అనీల్‌కుమార్, మహేందర్, పోలీసులు రజనీకర్, సాంబయ్య, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల బైక్ ర్యాలీ

మంగపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్లుగీత కార్మికులు గురువారం మండలంలోని కమలాపురంలో అంబేద్కర్ సెంటర్ నుంచి మంగపేటలోని అంబేద్కర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంగపేటలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు గుండెబోయిన రవిగౌడ్, బుర్ర శ్రీనివాస్, రంగు సత్యంలు హాజరై మాట్లాడారు. ఏజెన్సీలో నివశిస్తున్న కల్లుగీత కార్మికులు ఎన్నో రకాల సమస్యలతో బాధపడుతున్నారని, దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. ఏజెన్సీలో రద్దుచేసిన సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలని, సభ్యత్వ నమోదును చేసి సేఫ్టీ మోకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 18వరకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలలో భాగంగా కల్లుగీత అమరుల యాదిలో ప్రతి మండలంలోని ప్రతి గీత కార్మికుడి సమస్యను గుర్తించాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి మోరంచలోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన ప్రాణాపాయం

గణపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన కారు మోరంచ వాగులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మండల కేంద్రం నుంచి ధర్మరావుపేటకు వచ్చే రహదారిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... భూపాలపల్లికి చెందిన నరేందర్ వ్యక్తిగత పని నిమిత్తం తెల్లవారుజామున గణపురం వెళ్తున్నాడు. ఈ క్రమంలో అక్కడున్న గుంతను తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో నరేందర్‌కు ప్రాణాపాయం తప్పింది.